నిలిచిన దీపం

ఇసుకపల్లి సుజాత



అదురుతున్న గుండెతో నది వంక చూశాడు కుమార్.

అతని మొహంలో బాల్యపు ఛాయలు తొంగి చూస్తున్నాయి. కృత నిశ్చయం, భయం, ఆందోళన, జంకు అన్నీ కలిసి అతని మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు అతన్ని చూస్తేనే తెలిసిపోతోంది. స్కూల్ యూనిఫామ్‌లా ఉన్నాయి అతని బట్టలు. అతను బీదరికంలో ఉన్నాడని మాత్రం అనిపించట్లేదు. మనిషి ఓ మోస్తరు లావుతో బాగా పొడుగ్గానే ఉన్నాడు.

వేగంగా పరిగెత్తుకుంటూ రావటంతో కుమార్‌లోని అణువణువూ కంపిస్తోంది. ఒడ్డున నుంచుని నీళ్ళపై దృష్టి నిలిపాడు. పొంగి దుడుకుగా దూసుకు వస్తున్న నీలి కెరటాలు తనను ఆహ్వానిస్తున్నట్లుగా అనిపించింది. ఏదో నిశ్చయించుకున్న వాడిలా గబుక్కున నదిలోకి అడుగు వేశాడు. అంతలోనే నిశ్శబ్దంగా మారిన నీటిలోని తన ప్రతిబింబం నిర్మలంగా స్వచ్ఛంగా మల్లెపూవులా చిరునవ్వు చిందిస్తున్నట్లు తోచింది.

అడుగు ముందుకి సాగలేదు. మతిపోయిన వాడిలా చివుక్కున తలెత్తి చుట్టూ కలయ జూశాడు.

నగరం పెరిగి పోయిందనటానికి సాక్ష్యంగా నది ఒడ్డు నుంచి కనుచూపు మేరలో భవనాలు పూరిగుడిసెలు పాలలో నీళ్ళలా ఒకదాని పక్కన మరొకటిగా కలిసిపోయి కనిపించాయి. కార్లలో వెళ్ళే వాళ్ళు కూలి పని చేస్తూ జీవించే వాళ్ళు ఎవరికి వారు సంతోషంగా హాయిగా ఊళ్ళోకి సాగిపోతున్నారు.

వింతగా అనిపించింది కుమార్‌కి. సూర్యుడి విభవం నెమ్మదిగా నదిలోకి జారిపోతుంటే చంద్రుడు క్రమంగా తన ప్రాభవాన్ని దశదిశలా చాటుకోవాలని తెగ ఆరాట పడిపోతున్నాడు.

ఫలితంగా భూమిపై చిరు చీకట్ల అలజడి! చుట్టూ కలయ చూశాడు. కొద్ది దూరంలో ఇసకలో కూర్చున్న బిచ్చగాడు కనిపించాడు.

ఒక చింకి బట్టను నడుముకి చుట్టుకుని ఉన్నాడు. నదిలోంచి వీచే నీట గాలికి కాబోలు సన్నగా వణుకుతున్నాడు.

ఆ బిచ్చగాడు తన వైపే చూడటం గమనించక పోలేదు కుమార్.

చటుక్కున నదిలోకి చూశాడు. కొందరు పడవల్లో సాగిపోతూ వలలను వలయాలుగా నదిలోకి విసిరి లాగుతూ ఎప్పటికప్పుడు ఆశగా వలను విప్పి చూసుకుంటున్నారు. వలలో పడే చేప కోసం విసుగు లేక వారు అవిశ్రాంతంగా శ్రమిస్తూనే ఉన్నారు.

వారిలో నిరాశ ఎక్కడా కనిపించలేదు! ఇంతలో తల్లిదండ్రులు చెల్లి తమ్ముడు ఒక్కసారి గుర్తుకొచ్చారు.

ఏడుపొచ్చింది. కానీ అంతలోనే తన నిర్ణయం మాత్రం మార్చుకోకూడదని నిశ్చయించుకున్నాడు.

కనిపించే దైవం తల్లి. అందుకే అక్కడ్నించే ఇంట్లో ఉన్న తల్లికి మరోసారి మనస్ఫూర్తిగా దండం పెట్టుకున్నాడు. 'పాపం వాళ్ళు నా కోసం వెతుక్కుంటూ ఉంటారేమో! ..... పోనీ వెతుక్కోనీ నాకేం'

'ఏమీ చేతకాని వాడివి వెధవవి ... నీకేం నువ్వు పదో క్లాసు తప్పి ఇంట్లో కూర్చున్నావ్. బైటకెళ్తే అందర్లో నాకు తలవంపులుగా ఉంటుంది. మీ వాడు ఫెయిల్ అయ్యాట్ట నిజమేనా అని అందరూ అడుగుతారు. అప్పుడు నా మొహం ఎక్కడ దాచుకోను?' అంటూ నాన్న తిట్టాడుగా.

'నేను .... నేను.... చచ్చిపోతే వాళ్ళకి ఏ బాధలూ ఉండవు. హాయిగా ఉంటారు.' వద్దనుకున్నా పొంగి చెంపల మీదుగా జారిపోతున్న కన్నీళ్ళను చొక్కాతో తుడుచుకున్నాడు కుమార్.

అమ్మ .... అమ్మ మాత్రం ఊరుకుందా?

'చదువు కోరా వెధవా అంటే వింటేనా. ఇప్పుడు చూడు నీ తోటి వాళ్ళు చక్కగా కాలేజీల్లో చేరతారు. నువ్వు మాత్రం నూతిలో కప్పలా పదో క్లాసులోనే ఉంటావ్ అని అనలేదా!

ఏడ్చి ఏడ్చి కుమార్ కళ్ళు ఎర్రబారినాయి. తనకంటే చిన్నవాళ్ళయిన తమ్ముడికి, చెల్లెలికి కూడా తనంటే ఎంత చిన్న చూపు.

'అన్నయ్య పదో క్లాసు ఫెయిల్ అవటంతో ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళాలంటే మా కెంతో సిగ్గుగా ఉందమ్మా' అని అమ్మతో చెప్పారా వాళ్ళు!

చెలెదంత లేరు. చివరికి వాళ్ళ దృష్టిలో కూడా నేను చులకనై పోయాను. ఇంక నేనెందుకు బతకాలి?' అనుకుంటూ కుమార్ అమాంతం నదిలోకి వెళ్ళిపోయి నీళ్ళల్లో మునిగి చచ్చిపోదా

ఇంటర్ విద్యార్థులారా!
1957 లో స్థాపించిన

రవి కళాశాల

[బ్రాడీపేట, గుంటూరు]

ఎన్నో వేలమంది ఇంజనీర్లను, డాక్టర్లను తయారుచేసి ఆంధ్రుల అభిమానం చూరగొన్న సంస్థ.
ఇపుడు ఇంటర్, Bi.P. M.P. గ్రూపులతో చదివే వారి కోసం

రవి హాస్టల్ ట్యూషన్

ట్యూషన్స్, గైడ్సు అవసరం లేకుండా ఇంటర్ పరీక్షలలోనే గాక ఎంట్రన్సుపరీక్షలలోకూడా నెగ్గటానికి ఎంతో ఉపయోగపడుతుంది.
వివరాలకు రు. 5/-లు పంపండి.

సి. ఏ. ఎన్. ధన్,
డైరక్టర్.

నిలిచిన దీపం

మనుకుని ముందుకి పరుగు తీయబోయాడు.

కానీ వెళ్ళలేకపోయాడు.

తన రెండు చేతుల్ని అంగుళమైనా కదలనీయకుండా గట్టిగా పట్టుకున్నది ఎవరా అని గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు.

అతడు ఎవరో కాదు.

ఇందాక తను చూసిన బిచ్చగాడే!

చింకి బట్టల్తో ఎండిపోయిన శరీరంతో జీవచ్ఛవంలా జీవిస్తున్న బిచ్చగాడు.

కుమార్‌కి కంపరం పుట్టింది.

'ఛీ..... ఒదులు.... నన్ను ముట్టుకోకు' అంటూ ఒక్క పెట్టున ఆ బిచ్చగాడి పట్టును వదిలించుకోబోయాడు కుమార్.

కానీ సాధ్యపడలేదు.

'అబ్బ.... ఇంత బక్కచిక్కినా వీడిలో శక్తి చావలేదే!' అని ఆశ్చర్యపోయాడు కుమార్.

'నిన్ను వదిలేస్తాను గానీ కాస్సేపు ఇక్కడ కూర్చొ బాబూ. నీతో మాట్లాడాలి' అన్నాడు ఆ బిచ్చగాడు కాస్త దూరంగా జరిగి కూర్చుంటూ.

'ఛీ.... ఛీ..... నాతో మాట్లాడ్తావా' అన్నాడు కుమార్ ఏవగింపుగా మొహం పెట్టి.

మరుక్షణంలో 'వాడితో నాకేం పని' అన్నట్టు నదిలోకి వెళ్ళబోయాడు కుమార్.

'ఆగుబాబూ..... ఆగు. నా మాట ఒక్కటి విని తరవాత నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి. కాదనటానికి నేనెవర్ని?'

చప్పున ఆగి వెనక్కి తిరిగాడు కుమార్.

'పోనీ అంతగా బతిమాలుతున్నాడు వింటే పోలా. ఆ తరవాతే చచ్చిపోతాను' అనుకున్నాడు.

'నువ్వు నదిలోకి ఎందుకు వెళ్ళాలనుకున్నావు బాబూ'

'ఎందుకేంటి? చచ్చిపోదామనుకున్నాను' అదేం పిచ్చి ప్రశ్న అనట్టున్నాయి కుమార్ మాటలు.

'నీ కెందు కలా అనిపించింది' కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్నట్లున్న ఆ బిచ్చగాడి నోట్లోంచి నీరసంగా వస్తున్నాయి మాటలు.

అయినా ఒక తోటి మనిషిని రక్షించాలన్న తపన మానవత్వం అతని నీరసాన్ని జయించాయి.

'ఎందుకు.... ఎందుకంటే నేను..... నేను పదో క్లాసు ఫెయిల్ అయ్యాను' దుఃఖం దిగమింగుకుంటూ అన్నాడు కుమార్.

గట్టిగా నవ్వాడు బిచ్చగాడు.

ఆ చప్పుడుకి నీటిమీద తిరుగుతున్న రంగు రంగుల పక్షులు ఒక్కసారిగాపైకి ఎగిరిపోయాయి.

కుమార్ అయోమయంగా అతని వంక చూశాడు.

'అయితే బాబూ.... లోకంలో నీలాంటి వాళ్ళందరూ ఇలాగే చేస్తున్నారా?'

ఖంగుతిన్నాడు కుమార్.

అంతలోనే సర్దుకుని 'అమ్మా వాళ్ళు నన్నెందుకు తిట్టాలి? పైగా నలుగుర్లోనూ నాకు అవమానంగా ఉండదూ. బిచ్చగాడివి ఇవన్నీ నీకేం తెలుస్తాయిలే' పొగరుగాను హేళనగాను ఉన్నాయి కుమార్ మాటలు.

'నీ తల్లి దండ్రులు ఎప్పుడూ నీ మంచిని కోరేవారే బాబూ. అందుకే వాళ్ళు ఒకమాట అన్నా నువ్వు పడటంలో తప్పు లేదు. ఇంకా బాగా చదివి పాసయి అందరికీ నీ సత్తా చూపించాలి. అప్పుడు అందరూ నిన్ను మెచ్చుకుంటారు. నువ్విప్పుడు చచ్చిపోతే వాళ్ళు నిన్నెలా మెచ్చుకుంటారు?' ప్రశ్నించాడు బిచ్చగాడు.

'నాకు నీతులు చెప్పటానికి అసలు నువ్వెవరివి. ఇక్కడెందుకున్నావ్?' విసుగు పుట్టింది కుమార్‌కి.

'చెబుతాను బాబూ అదీ చెబుతాను. కాళ్ళూ చేతులు ఉన్నాయి కాబట్టి నేనూ ఒక మనిషినే అని ఒప్పుకుంటావుకదూ. ఇప్పుడైతే నేను ఈ వూళ్ళో రోడ్డునే ఇల్లుగా చేసుకుని జీవిస్తున్నాను. ఒకప్పుడు నేను నా భార్య ఇద్దరం కలిసి పని చేసుకుని వచ్చినదాంతో తిని తృప్తి పడేవాళ్ళం. సరిగ్గా రెండేళ్ళ క్రితం చేపలు పట్టటానికి నలుగురు ఆడవాళ్ళతో కలిసి నీటిలోకి వెళ్ళిన నా పెళ్ళాం ఇదే రోజున విధివశాన ఈ నదిలోనే పడి చచ్చిపోయింది బాబూ......' దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

'అప్పట్నుంచీ ఈ రోజున ఇలా నది ఒడ్డున గడుపుతూ ఉంటాను. నాలో శక్తి చచ్చిపోయింది. ఏ పనీ చెయ్యలేను. అందుకే ఎవరైనా జాలి తలిచి పెడితే తింటాను...'

'చాల్లే ఇంక నీ సోది కాస్త ఆపు. నువ్వు చెప్పటం నేను వింటం రెండూ బాగానే ఉన్నాయి. గానీ ఫో..... నీ పని నువ్వు చూస్కో' అంటూ కుమార్ లేచాడు.

ఫస్ట్ క్లాసులో పాసైన తన ఫ్రెండ్స్ కిరణ్, రఘు, ప్రసాద్‌లు గుర్తొచ్చారు కుమార్‌కి.

మనస్సు కలుక్కుమంది.

'వాళ్ళు కాలేజీలో చేరితే తను మళ్ళీ అదే స్కూల్లో చదువుకోవాలా? ఆ అవమానాన్ని నేను భరించలేను....' బాధగా అనుకున్నాడు కుమార్.

మెల్లిగా లేచాడు.

గబగబా నదిలోకి అడుగులు వేశాడు.

తన మాటలు కుమార్‌లో ఎటువంటి మార్పునీ కలిగించలేదని గ్రహించాడు బిచ్చగాడు.

'బాబూ..... ఒక్కమాట' కుమార్‌ని కేకేశాడు బిచ్చగాడు.

అతని మాటలు పట్టించుకోకుండా వెళ్ళలేక పొయ్యాడు కుమార్.

'నాకో చిన్న సాయం చేసి పెడ్తావా బాబూ....'

'నీకా! ఏవిటది?' కోపంగాను, విసురుగాను అన్నాడు కుమార్.

'ఏమీ లేదు బాబూ.... నువ్వు కనక చచ్చిపోవాలనుకుంటే మాత్రం నీ చొక్కా నాకు యిచ్చి వెళ్ళు. అది తొడుక్కుని రోజూ నిన్ను తలుచుకుంటాను.'

'చూడబోతే రేపో మాపో చచ్చేవాడిలా ఉన్నావ్. చొక్కా నీ కెందుకు?' హేళనగా ప్రశ్నించాడు కుమార్.

'అసలే చలిగా ఉంది. బతికే ఒక్క రోజైనా కాస్త వెచ్చగా బతకొచ్చుకదా అన్న ఆశే బాబూ నాచేత

నిన్నిలా అడిగించింది' అన్నాడు బిచ్చగాడు.

అతడి కళ్ళల్లో ఏదో కొన మెరుపు కనిపించింది.

నిర్ఘాంతపోయాడు కుమార్.

ఇంట్లో వేళకి అన్నం పెట్టే తల్లి, కావలసినవన్నీ ప్రేమతో కొని పెట్టే తండ్రి, అభిమానం కురిపించే చెల్లీ తమ్ముడు ఉన్నారు తనకి. అయినా చిన్నమాట పట్టుకుని తన నిండు జీవితాన్ని అంతం చేసుకోవాలనుకున్నాడు.

ఇక్కడ, తిండిలేక శుష్కించి పోయిన శరీరం, కట్టుకోటానికి బట్టలు లేక చలికి వణికి పోతూ కొడిగట్టి పోతున్న దీపంలా ఈ బిచ్చగాడు. అయినా అతను బతకాలనుకుంటున్నాడు. ఉన్న ఒక్క రోజైనా వెచ్చగా బతకటానికి వీలుంటుందేమోనని ఆశపడుతున్నాడు.

రెండూ పక్క పక్కనే సినిమారీళ్ళలా కుమార్ కళ్ళముందు కదిలాయి.

ఏవిటీ?

'జీవితం అంత విలువైనదా? ముఖ్యమైనదా?' ఏవో పెద్ద మాటలు ఆ చిన్న వాడి మనసులో మెదిలాయి.

కానీ కుమార్ మాత్రం ఏదో నిశ్చయించుకున్న వాడిలా చొక్కా గుండీలు విప్పసాగాడు.

అది చూశాడు బిచ్చగాడు.

అంటే ఇన్ని చెప్పినా ఈ కుర్రాడు తన జీవితాన్ని అంతం చేసుకోటానికే నిర్ణయించు కున్నాడన్న మాట!

'అయ్యో.... బాబూ.... రక్షించండి.... బాబు నదిలో పడిపోతున్నాడు.....' అంటూ తన శక్తి కొద్దీ అరిచాడు బిచ్చగాడు. ఎలాగైనా ఆ పిల్లాడి ప్రాణాలు కాపాడాలనే తాపత్రయంతో.

క్రితం రోజు నుంచీ తిండ దొరక్క పోవటంతో వెర్రి నీరసం ముంచు కొచ్చేసింది. లేవలేక పోతున్నాడు బిచ్చగాడు.

అతని కేకలు ఎవరికీ వినిపించినట్టు లేదు.

ఎవ్వరూ రాలేదు.

కుమార్ మౌనంగా తన చొక్కా విప్పి బిచ్చగాడి చేతిలో పెట్టాడు.

'నేను పోతున్నా' అన్నాడు కుమార్ దృఢమైన స్వరంతో.

'బాబూ.... ' అంటూ కన్నీరు కారుస్తూనే

'దొరా.... బాబూ.... వేగరండి.... అయ్యో' అంటూ గొంతు చించుకుని పిచ్చిగా అరుస్తున్నాడు బిచ్చగాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకున్నది కొద్ది సేపే. అయినా ఏదో తెలియని బంధం ఆ బిచ్చగాణ్ణి కదిలించింది.

'ఎందుకు తాతా అలా అరుస్తావ్? నీకసలే నీరసంగా ఉంటేను. నేను చచ్చిపోను. నువ్వేం భయపడకు. నేను వెళ్ళేది మా ఇంటికి.... తెలుసా? నీకోసం అన్నం కూడా తీసుకొస్తాను..... సరేనా' అన్నాడు కుమార్ బిచ్చగాడి చేతులు పట్టుకుని చిన్నగా నవ్వుతూ.

బిచ్చగాడి మనసు ఆనందంతో పొంగిపోయింది. □

ప్రేక్షకులని ఉర్రూతలూగిస్తున్న వృద్ధ కవలలు!

అవకాశానికి, అదృష్టానికి వయస్సుతో నిమిత్తం లేదు. అలాంటిదే ఎలెన్, ఎలిస్ జంట ప్రదర్శన. గత ముప్ఫయి సంవత్సరాలుగా ఎలెన్, ఎలిస్ అనబడే నృత్యగాన బృందం యూరప్ అంతా పర్యటించి ప్రదర్శనలిచ్చి ఘనవిజయం సాధించారు. వీరిరువురు కవలలు. వీరి నృత్యానికి ఇంతటి ఖ్యాతి రావడానికి వీరి పొడవైనకాళ్ళు కూడా ఒక ముఖ్య కారణం.

50 సంవత్సరాల వయస్సు వచ్చినా వీరు నేటికి నృత్య ప్రదర్శనలు, దూరదర్శన్ ప్రదర్శనలూ ఇస్తూనే ఉన్నారు. కాని తొలుత వీరు ప్రదర్శనలు ప్రారంభించిన జర్మనీలో గాక, ఘనవిజయాలను సాధించిన పారిస్‌లోను గాక ప్రస్తుతం ఇటలీలో ఎక్కువగా నివసిస్తున్నారు. ఇటలీ వీరికి స్థిరనివాస స్థలం అయింది. ఇందుకు కారణం నటుడు అంబెరిటో ఆర్సినితో నటించడానికి ఎలెన్ కుదుర్చు-కున్న దీర్ఘకాల ఒప్పందం కాదు. అది ఎప్పుడో పూర్తి అయింది. జర్మనీలో తాము ఇస్తున్న నృత్యగాన ప్రదర్శనలకి ఎక్కువ గిరాకి లేకపోవడమే ఇందుకు కారణం అని వారన్నారు. కానీ ఇటలీలో వీరి ప్రదర్శనల పట్ల వ్యామోహం ఉంది. ఇద్దరు వనితలు కలిసి తమ కాళ్ళను ఈ విధంగా ప్రదర్శించడం ఇటలీ ప్రజలకు ఆకర్షణీయంగానే ఉన్నది.

ఈ ఇద్దరు కవలలు ఈ రోజుకి తీగల్లాగా నాజూగ్గా ఉన్నారు. వీరు ప్రకృతిసిద్ధమైన సౌందర్య సాధనాలనే వాడతారట. ప్రస్తుతం తూర్పు జర్మనికి చెందిన నెర్చావ్ వీరి జన్మస్థలం. వీరి తండ్రి తన కూతుళ్ళు ఇంతటి అంతర్జాతీయ ఖ్యాతి గడిస్తారని కల్లో కూడా ఊహించలేదు. వీరు ఆరు ఏళ్ళ వయస్సులో లీప్‌జిగ్ బాలే స్కూల్లో చేరారు.

ఎలెన్ డాక్టరవ్వాలని, ఎలిస్‌ఫాషన్ డిజైనర్ కావాలని అనుకున్నారు. కానీ ఆ విధంగా జరగలేదు. 1947లో ఈ కవలలు లీప్‌జిగ్‌లోని ఒపేరా చిల్డ్రన్స్ బాలే స్కూల్లో చేరారు. మూడు సంవత్సరాలానంతరం వీరు ఒపేరా డాన్స్ స్కూలు ప్రవేశ పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. కొద్ది రోజుల తరువాత వీరు పశ్చిమ జర్మనీకి వచ్చారు.

1952లో వారి ప్రథమ ప్రదర్శన 'డజెల్ డోర్ఫ్ రెవూపలాస్ట్ పల్లాడియమ్‌లో జరిగింది. అదృష్టం వీరిని వరించింది. దీని డైరెక్టర్ వీరి ప్రదర్శనలకు ఎక్కువగా ఆకర్షింపబడి పారిస్‌లోని లిడోలో ప్రదర్శనకు అవకాశం కలుగజేసాడు. అక్కడా వీరు ఘనవిజయం సాధించి త్వరితగతిని "బ్లూబెల్ గర్ల్స్"లో ప్రముఖ దర్శకులుగా అయ్యారు.

"లిడోలో అవకాశం రావడంలోని అనుభవం వర్ణనాతీతం. అయిదు సంవత్సరాలు లిడోలో ఉండటం మాకు వ్యోమగాములు చంద్రమండలంలో కాలు మోపినట్లు ఉంది" అని గత స్మృతులు జ్ఞాపకం తెచ్చుకుంటూ ఎలిస్ అన్నది. "అర్క్ డి ట్రియోఫ్ వెళ్ళడం తారాపథాన్ని అందుకున్నట్లే మాకు అనిపించింది" అని ఎలెన్ అన్నది.

"మేము వృద్ధ దంపతుల్లా చాలా వాటిల్లో ఒకటిగా ఉంటాము. కాని కొన్నిట్లో విభేదాలు ఉన్నాయి" అని ఎలిస్ అన్నది.

"అవును. ఎలిస్ చాలా తెలివైనది. ఆమె శాంత స్వభావురాలు. యోచించి పనిచేస్తుంది" అని ఎలెన్ చెప్పింది.

"ఎలెన్ ఎక్కువ చురుకుదనం కలది. చాకచక్యంతో నిర్ణయాలు చాలా త్వరితగతిన తీసుకుంటుంద"ని ఎలిస్ చెప్పింది.

వీరిద్దరూ కూడా వివాహాలు చేసుకోలేదు. అది వీరి జాతకఫలమేగానీ, కవలలు కావడమో లేదా వీరు చేపట్టిన వృత్తో ఇందుకు కారణం కాదని వీరు అంటున్నారు. ఇద్దరూ కూడా సింహలగ్నంలో పుట్టినవారే. ఒకసారి ఒక జ్యోతిష్కురాలు వీరికి వివాహం అయ్యే అవకాశం లేదని జ్యోతిష్యం చెప్పిందట.

ఏమైనా ఈ వృద్ధ కవలల డాన్స్ బృందం జనాన్ని వెర్రెక్కిస్తున్నారనడంలో సందేహంలేదు.

-(ఒ. వి.)